## క్లుప్తంగా

### చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ప్రొద్దుటూరుకు చెందిన పుల్లగూర మల్లికార్జున, నాగేశ్వరి దంపతులు రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అర్చకులకు విరాళం ఇచ్చారు. దాతలను పూలమాల, దుశ్శాలువాతో సత్కరించి తీర్థప్రసాదం అందజేశారు. ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పీపీ కుమార్‌రెడ్డి ఉన్నారు.

### పంట కాలువలకు నీటి విడుదల



పంటల కాలువలకు పారుతున్న నీరు

అవుకు: అవుకు రిజర్వాయర్ నుంచి పంట కాలువలకు ఆదివారం సాయంత్రం నీటిని విడుదల చేసినట్లు ఎస్సార్బీసీ అధికారులు తెలిపారు. అవుకు రిజర్వాయర్ సామర్థ్యం 4.148 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.6 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు చెప్పారు. ఖరీఫ్ సాగు ప్రారంభమై నారుమళ్లు వేసుకోవడానికి ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఎస్సార్బీసీ కెనాల్ ద్వారా పంటల సాగుకు 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, త్వరలో 250 క్యూసెక్కుల వరకు వదులుతామని పేర్కొన్నారు.

### వాసవీమాతకు ప్రత్యేక పూజలు



వేరుశనగ విత్తనాలతో అమ్మవారి అలంకరణ

ప్యాపిలి: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ ఒక విశేష అలంకరణలో పూజలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యులు తెలిపారు. 17వ రోజు వాసవీమాతను వేరుశనగ విత్తనాలతో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య మహిళలు అధిక సంఖ్యలో హాజరై వాసవీమాతకు పూజలు చేశారు.

### ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



నందవరంలో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

బనగానపల్లె: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో జీవిస్తే ప్రశాంత జీవనం సాగిస్తారని త్రైత సిద్ధాంత ప్రభోదా సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మిడుతూరు కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. ఆదివారం మండలంలోని నందవరంలో భగవద్గీత గ్రంథాలపై ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గోకరి శ్రీను, రాఘవేంద్ర, రవి, జగదీష్, సుబ్బలక్ష్మీ, సుజాత, హైమవతి, రమణమ్మ, రంగమ్మ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



క్షతగాత్రునికి ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

కోవెలకుంట్ల: మండల పరిధిలోని కలుగొట్ల–డబ్ల్యూ గోవిందిన్నె మార్గంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. 108 అంబులెన్స్ సిబ్బంది సమాచారం మేరకు.. గోవిందిన్నె గ్రామానికి చెందిన అశ్వద్ధామ సొంత పనుల నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్లకు వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. మండలంలోని కలుగొట్లకు చెందిన ఇద్దరు వ్యక్తులు మరో బైక్‌పై ఎదురుగా వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు గాయపడడంతో 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి నంద్యాల ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.



బనగానపల్లెలో రహదారులపై విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలు

# వామ్మో వీధి కుక్కలు

బనగానపల్లె: పట్టణంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో వీధికుక్కల సంచారం పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. సుమారు 50 వేల జనాభా ఉన్న బనగానపల్లెలో కుక్కల సంఖ్య పెరుగుతుండడంతో ప్రజలు రహదారుల వెంట నడవడానికి భయపడుతున్నారు. ఇటీవల జరిగిన సంఘటన స్థానికుల్లో ఆందోళన పెంచింది. ఈ నెల 11న పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలోని కైప్ గ్రామంలో నాలుగేళ్ల మధుప్రియ అనే బాలికపై వీధికుక్కలు దాడి చేసి తీవ్రంగా కరవడంతో బాలిక మృతిచెందిన ఘటన సంచలనం రేపింది. ఈ ఘటన నేపథ్యంలో బనగానపల్లెలోనూ ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కుక్కలు రహదారుల వెంట నడుస్తున్న ప్రజలను కరిచిన ఘటనలు ఉన్నాయి. కుక్కల దాడులు ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయినా ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ అధికారులు వీటి నియంత్రణపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల భద్రత దృష్ట్యా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

కొలిమిగుండ్ల: గొర్విమానుపల్లె ఉన్నత పాఠశాల భవనాలపై మెయిన్ విద్యుత్ తీగలు ఉండడంతో ప్రమాదకరంగా మారాయి. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఎప్పుడు ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం బలమైన గాలులు వీస్తున్నందున తీగలు తగులుకొని నిప్పులు పడుతున్నాయి. పైగా ఎప్పుడు కింద పడుతాయోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రార్థన చేసే సమయంతో పాటు విరామ సమయాల్లో విద్యార్థులు మైదానంలో తిరుగుతుంటారు. ఈ సమయంలో విద్యుత్ తీగలు కింద పడితే ప్రమాదం చోటు చేసుకునే అవకాశాలున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పాఠశాల భవనాల మీదుగా వెళ్లిన విద్యుత్ తీగలను మార్పు చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.



పాఠశాల భవనం మీదుగా ఉన్న విద్యుత్ తీగలు

# మిల్క్ సెంటర్‌కు మోక్షమెప్పుడో..?



అసంపూర్తిగా ఉన్న బల్క్‌మిల్క్ సెంటర్

బేతంచెర్ల: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా హెచ్ కొట్టాల గ్రామంలో నిర్మాణం ప్రారంభమైన బల్క్ మిల్క్ సెంటర్ ఏడాదికిపైగా అసంపూర్తిగా ఉండడంతో గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామ సచివాలయం, రైతులకు సేవలందించేందుకు రైతు భరోసా కేంద్రం, రోగులకు వైద్య సేవల కోసం వైఎస్సార్ హెల్త్ క్లినిక్, పాడి రైతుల కోసం బల్క్ మిల్క్ సెంటర్ ఏర్పాటు వంటి పలు కార్యక్రమాలకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో శ్రీకారం చుట్టారు. హెచ్ కొట్టాలలో రూ.35 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణం పూర్తయి ప్రజలు వాటిని ఉపయోగించుకుంటున్నారు. అయితే రూ.15.74 లక్షలతో చేపట్టిన బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణం కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో లేక ఇతర కారణాల వల్ల మధ్యలోనే నిలిచిపోయింది. ఈ సెంటర్ పూర్తయితే పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

# అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



ఆకుమల్లలో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ

సంజామల: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హనుమంత్ నాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లడుతూ.. గ్రామాల్లో సమస్యలను సృష్టిస్తూ నేరాలకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రౌడీ షీటర్లు అల్లర్లకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. సంజామల, కోవెలకుంట్ల ఎస్‌ఐలు రమణయ్య, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీట్ ఎత్తివేస్తాం



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ



తనిఖీలు చేస్తున్న పోలీసులు

బేతంచెర్ల: నేరమయ జీవితానికి దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్‌ను ఎత్తివేస్తామని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో మండలానికి చెందిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వారానికి ఒక్కసారైనా కౌన్సెలింగ్‌కు హాజరుకావడం తప్పనిసరి అన్నారు. చేసిన తప్పులు క్షణికావేశంలో జరిగి ఉంటే, అవి పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. లేకపోతే జీవితాంతం జైలు జీవితం గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. పిల్లలు, కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మారాలని హితవుపలికారు. సమస్యలు ఉంటే పోలీసులను ఆశ్రయించాలి తప్ప సొంతంగా నిర్ణయాలు తీసుకోవద్దన్నారు.

**చిగురుమానుపేటలో కార్డన్ సెర్చ్**

డోన్ టౌన్: పట్టణంలోని చిగురుమానుపేట, రైల్వే స్టేషన్‌లలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్, ఎస్‌ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, మమత పోలీసు సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులు, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే చిగురుమానుపేటలో అనుమానితుల ఇళ్లు, వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ.. రైల్వే మార్గం నుంచి పట్టణంలోకి గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

# పరామర్శ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని ఈద్గానగర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గొండ కంబగిరి రాముడు మోకాలు నొప్పితో చికిత్స తీసుకుని ఇటీవల డిశ్చార్జ్ అయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం రాముడు ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ నాయకులు సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అంబటి రవికుమార్ రెడ్డి, కటికవానికుంట మోహన్‌రెడ్డి, లియాఖత్, రోబో, బాలు, కంబగిరి ఉన్నారు.



వైఎస్సార్‌సీపీ నాయకుడిని పరామర్శిస్తున్న కాటసాని

# వడ్డెర్ల సంక్షేమం పట్టని ప్రభుత్వం



మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకుడు శిల్పిసుబ్బరాయుడు

బనగానపల్లె రూరల్: వడ్డెర కులస్తులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అఖిలభారత వడ్డెర సమాజ సంఘం జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి శిల్పి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో వడ్డెర సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడ్డెర కులస్తులు ఆర్థిక, సామాజికంగా, విద్యాపరంగా ఇంకా వెనుకబాటులోనే ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో వడ్డెర సొసైటీలను ఆదుకుంటామని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. సమావేశంలో సంపంగి మధు, నాగరాజు, మధుశేఖర్, గోగుల వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

# ఘాటెక్కిన పచ్చిమిర్చి..!

బనగానపల్లె: పట్టణ మార్కెట్‌లో పచ్చిమిర్చి ధర కిలో రూ.120కి చేరడంతో సామాన్య, మధ్య తరగతి వర్గాలపై ఆర్థిక భారం పడుతోంది. ఇటీవల కాలంలో ఈ ధర ఎన్నడూ చూడలేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల క్రితం వరకు కిలో రూ.40 నుంచి రూ.50 మధ్య మాత్రమే ఉండే ధర, గత రెండు వారాలుగా రోజురోజుకూ పెరిగి ఇప్పుడు రూ.120కి చేరింది. స్థానికంగా మిరప పంట దిగుబడి లేకపోవడం, బెంగళూరు సహా ఇతర సుదూర ప్రాంతాల నుంచి సరఫరా ఆధారపడడం వల్ల ధర పెరిగిందని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. అక్కడ కూడా పంట దిగుబడి ఆశాజనకంగా లేకపోవడంతో మార్కెట్‌లో సరఫరా తగ్గిపోయినట్టు అంటున్నారు. కేవలం పచ్చిమిర్చి మాత్రమే కాక, ఇతర కూరగాయల ధరలు కూడా గతంతో పోలిస్తే ఎక్కువగానే ఉంటోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు జోక్యం చేసుకొని ధరలు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన మిర్చి

**ప్యాపిలి మార్కెట్‌లో రూ.70**

ప్యాపిలి: స్థానిక మార్కెట్‌లో కొద్ది రోజులుగా పచ్చిమిర్చి మంచి ధర పలుకుతోంది. ప్రారంభం నుంచే కిలో రూ.50–60 పలుకుతున్న మిర్చి ఆదివారం కిలో రూ.70 పలికింది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు మిర్చి తీసుకొచ్చిన రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. మరికొన్ని రోజుల పాటు మిర్చి ధర ఇలాగే ఉంటే తమ కష్టాలు తీరుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు.

–అమడాల, గుంజలపాడు, జోళదరాశి ఫీడర్ల పరిధిలోని కోవెలకుంట్ల, భీమునిపాడు, బిజనవేముల, సొదరదిన్నె, కంపమల్ల గ్రామాలకు ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుంది.

- గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె ఫీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..
- కలుగొట్ల, కొప్పెర్ల, రేవనూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉంటుంది.

**సంజామలలో విద్యుత్ వేళలు**

సంజామల: మండలంలో వ్యవసాయానికి సోమవారం నుంచి ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్ స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

## ముగిసిన మౌలాలిస్వామి జార్తలు

కొలిమిగుండ్ల: పెట్నికోటలో మౌలాలి స్వామి జార్తలు ఆదివారం ముగిశాయి. మొహర్రం ముగిసిన తర్వాత జార్తలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ముందుగా పీర్లచావిడిలో కొలువైన మౌలాలిస్వామి పీరును ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మేళతాళాల మధ్య గ్రామ వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున చేరుకుని జార్తలను తిలకించారు. కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

## నేడు, రేపు విద్యుత్ కోతలు

డోన్ టౌన్: మల్యాల సబ్‌స్టేషన్ యాపదిన్నె ఫీడర్ పరిధిలో 11 కేవీ పనుల కారణంగా సోమ, మంగళవారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. యాపదిన్నె, ఎద్దుపెంట, తాడూరు గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారు జామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు తిరిగి సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

## కరువు భత్యం చెల్లించాలి

కోవెలకుంట్ల: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డీఏలను(కరువు భత్యం) వెంటనే చెల్లించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యోగులకు సకాలంలో డీఏలు, మెరుగైన పీఆర్సీ ఇస్తామని ఎన్నికల వేళ కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఏడాది పాటు ఓర్పు వహించామని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటి వరకు ఒక్క డీఏను కూడా ఇవ్వలేదని ఆరోపించారు. 2024 జనవరి నుంచి మూడు డీఏలను పెండింగ్‌లో పెట్టారన్నారు. ఇంత వరకు పీఆర్సీని కూడా నియమించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని పెండింగ్ డీఏలు, పీఆర్సీని వర్తింపజేయాలని కోరారు.

## ప్యాపిలిలో మొహర్రం వేడుకలు ప్రారంభం



ప్యాపిలి: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. గత నెలలోనే వేడుకలు ప్రారంభం కావాల్సి ఉండగా స్థానికంగా నెలకొన్న పలు కారణాలతో గ్రామ పెద్దలు మొహర్రం వేడుకలను వాయిదా వేశారు. ఈ నెల 11న గుండం తవ్వడంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి ఖ్వాజా బందేనవాజ్ పీర్ల పెట్టెను పట్టణ ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చావిడిలో పీర్ల స్వాములు కొలువుదీరారు. ఈ నెల 18న చిన్నసరిగెత్తు, 20న పెద్ద సరిగెత్తు, 21న పీర్లు ఏటికి వెళ్లడంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని గ్రామ పెద్దలు తెలిపారు.



గంగమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

# గంగమ్మా.. కరుణించమ్మా

కొలిమిగుండ్ల: వర్షాలు సమృద్ధిగా కురిసి వాగులు, వంకలు ఉప్పొంగాలని కోరుతూ ఆదివారం రాఘవరాజుపల్లెలో మహిళలు గంగమ్మ తల్లికి పూజలు చేశారు. గ్రామ శివారులోని గంగమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. వాన కాలం వచ్చినా వర్షాలు కురవక తాగు,సాగు నీటి బోర్లు ఎండిపోతున్నాయన్నారు. పాడి పంటలతో పచ్చగా కళకళలాడాల్సిన సమయంలో రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. వానలు కురవక పంటలు సాగు చేయకపోవడంతో కూలీలకు పొలం పనులు లేకుండా పోయాయని మహిళలు పేర్కొన్నారు. గంగమ్మకు విశేష పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

# బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



కరాటే సాధన చేస్తున్న బాలికలు

డోన్ టౌన్: బాలికలు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలని విశ్వ హిందూ పరిషత్ దుర్గా వాహిని మాసిక వర్గ దక్షిణాంధ్ర సంయోజిక్ ఈపూరి లక్ష్మీ, భవాని, అరుణ, మల్లేశ్వరి అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో బాలికలకు హిందూ సంస్కృతి, సంప్రదాయలు, సమాజంలో మహిళల పాత్ర, స్త్రీల విలువలను వివరించారు. దేశంలో కొన్ని అరాచక శక్తులు లవ్ జిహాద్ పేరుతో సృష్టిస్తున్న విధ్వంసాల బారిన పడకూడదని సూచించారు. సమాజంలో ఎదురయ్యే పరిస్థితులను మానసికంగా, శారీరకంగా ఎలా ఎదుర్కోవాలో తెలియజేశారు. అనంతరం కర్రసాము, కరాటే నేర్పించారు. కార్యక్రమంలో రామకృష్ణ, గణేష్, రూపక్ తదితరులు పాల్గొన్నారు.

## యూట్యూబర్‌పై చీటింగ్ కేసు

డోన్ టౌన్: పట్టణానికి చెందిన యూట్యూబర్ రాజుపై ఆదివారం డోన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. వైఎస్సార్ నగర్‌కు చెందిన సుమలత కుమార్తెలకు కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని రూ.15 వేలు తీసుకున్నాడు. సీటు ఇప్పించకపోవడంతో నగదు తిరిగి ఇవ్వాలని ఆమె కోరింది. ఆమెపై దాడికి పాల్పడడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణ పోలీసులు రాజుపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఇలాంటి వ్యక్తులు యూట్యూబ్ విలేకరులమంటూ అధికారులు, పోలీసుల పేర్లు చెప్పి నగదు వసూలు చేస్తుంటారని.. వీరి మాటలు నమ్మి మోసపోవద్దని పోలీసులు సూచించారు. ఎవరైనా నగదు అడిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

# హామీల అమల్లో ప్రభుత్వం విఫలం



సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

బేతంచెర్ల: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని సీపీఐ రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య, రామాంజనేయులు, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. ఆదివారం బేతంచెర్లలో సీపీఐ 4 మహాసభ నిర్వహించారు. శేషారెడ్డి సర్కిల్ నుంచి కార్మిక సంఘాలు, ప్రజా నాట్యమండలి సభ్యులతో ర్యాలీగా బయలుదేరి పాత బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారన్నారు. పెన్షన్, తల్లికి వందనం పథకం మినహా మిగతా పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారన్నారు. హామీలను అమలు చేసేంత వరకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పెరుగుతున్న రావిచెట్టు

# పొంచి ఉన్న ప్రమాదం

పట్టణంలోని యూనియన్ బ్యాంక్ రోడ్డులోని ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ ప్రహరీలో రావిచెట్టు పెరుగుతోంది. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో చిన్న మొక్కగా ఉన్నది ఇప్పుడు చెట్టుగా మారుతుండడంతో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగలే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో ప్రజలు, వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. విద్యుత్‌శాఖ సిబ్బంది ట్రీ కటింగ్ పేరుతో వివిధ ప్రాంతాల్లో చెట్లను కత్తిరిస్తారు.. కానీ ఇది మాత్రం కనిపించదా అన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–డోన్ టౌన్